ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

# వాన చినుకు మనస్తత్వాన్ని చిత్రించిన "నగరంలో వాన"

**డా. ఎన్. విద్యాప్రవీణ,**

తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్,

ఎస్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల,

కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ.

Received: 03/02/2026
Article Accepted: 24/02/2026
Published Online: 27/02/2026
DOI:10.53414/Sahithyatharangini.2026.3.1.229

**వ్యాస సంగ్రహం:**

నగరంలో వాన కవితా సంపుటిని కుందుర్తి ఆంజనేయులు 1967 లో వెలువరించారు. ఇందులో వాన ప్రాముఖ్యతను వివరించారు. వానను కొందరు ఇబ్బందిగా, అసహనంగా స్వీకరిస్తే, మరికొందరు ఆళింగనం చేసుకుని పండుగ చేసుకునే విధానాన్ని వివరించారు. అదే విధంగా వాన చినుకుకు మాటలు వస్తే అది మాట్లాడుతుందో దాని మనస్తత్వాన్ని కూడా కుందుర్తి వివరించారు. హైదరాబాద్ నగరంలో పడిన వాన ఈ సంపుటికి ప్రధాన వస్తువుగా వివరించడమే వ్యాస ఉద్దేశం.

**కీలక పదాలు**: వర్షపు చినుకులు, రోడ్లు, ఆనందం, అందమైన, ఇబ్బంది, అద్భుతం, హైదరాబాద్, చార్మినార్.

**వివరణ:**

నగరంలో పడే వర్షంతో సగటు నగర ప్రజల జీవితాలను ముడిపెడుతూ వైవిధ్యంగా సాగిన కవిత్వం ఇది. నగరంలో పడిన వాన చినుకులు అన్నీ కుందుర్తితో మనసు విప్పి మాట్లాడినట్లుగా ఉంటుంది.

"నగరంలో వాన
కవిత్వం నా ఊహాంచలాల్లో కదిలాడుతున్నట్లు
జల్లులు జల్లులై కురుస్తుంది
ఆశు కవితలో నగర ప్రజలకు
ఆశీస్సులు పలుకుతున్నట్లు
అనంత ధారాసమేతంగా అంబరం మెరుస్తుంది

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

నగరంలో వాన
అంబరానికి అంత సంబరం ఎందుకంటే
నున్నగా తెల్లగా తళతళలాడే
సిమెంటు రోడ్ల అద్దాలలోకి
మింటి నుంచి మెడలు వంచి చూసి
తమ అందం చినుకుల కుప్పలుగా పోసి
అంతలేని ఆకాశమంత ఆనందంతో
మెలికలు తిరుగుతూ మిలమిలా మెరుస్తాయి మేఘాలు"
(నగరంలో వాన – కుందుర్తి – పుట 9)

వాన ప్రకృతికి ఒక అందమైన వరం. పల్లెల్లో వాన పడితే పచ్చని పొలాలు, చెట్లు, చెరువులు కొత్త అందాన్ని సంతరించుకుంటాయి. అదే వాన నగరంలో పడినప్పుడు మరో ప్రత్యేకమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తుంది. ఆకాశం నుంచి నిరంతరంగా కురిసే వర్షధారలు నగర ప్రజలకు ఆశీస్సులు అందిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల వాన నగరానికి ఒక శుభ సందేశంలా మారుతుంది. వానతో తడిసిన నగరంలోని తెల్లని సిమెంటు రోడ్లు అద్దాల్లా తళతళలాడుతున్నాయి. ఆ రోడ్లలో మేఘాలు తమ ప్రతిబింబాలను చూసుకుని ఆనందపడుతున్నట్లుగా కనిపిస్తుంది. మేఘాలు తమ అందాన్ని చినుకుల రూపంలో భూమిపై కుమ్మరిస్తున్నట్లు చెప్పడం ఎంతో అందమైన ఊహ. వర్షపు చినుకులు కేవలం నీటి బిందువులు కాకుండా మేఘాల సౌందర్యానికి ప్రతిరూపాలు. మేఘాలు మెలికలు తిరుగుతూ, మెరుస్తూ ఆకాశమంతా ఆనందాన్ని నింపుతున్నట్లు అనిపిస్తుంది. మేఘాలకు మనుషుల లక్షణాలను ఆపాదించడం వల్ల వర్షదృశ్యం మరింత సజీవంగా మారింది. సిమెంటు రోడ్లను అద్దాలతో పోల్చడం ద్వారా నగర వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లుగా చూసినట్లు ఉంటుంది.

"నగరంలో కురిసే వానకు తెలుసు
గొడుగు జీతపు రూకల్లో మిగిల్చి
కొనగలగడం వట్టిమాటని
గోనెసంచి కప్పుకోవడం నాగరికులకు మోటని
తడిసి మోపెడై వణుకుతూ వచ్చి
వంటింట్లో కుంపటి ముందు కూచోని

మర్నాడు మంచమెక్కితే
తను చేసిన ఘనకార్యం కనులారా చూసుకుంటున్నాట్లు
కిటికీలోంచి తొంగిచూస్తుంది చిటపటా చిలిపి జల్లుల్తో"
(నగరంలో వాన – కుందుర్తి – పుట 10)

వాన ప్రకృతిలో ఒక సహజమైన అందమైన దృశ్యం. వాన అందరికీ ఒకే విధమైన అనుభూతిని ఇవ్వదు. పేదలు, కూలీలు, రోజువారీ జీవనంపై ఆధారపడే ప్రజలకు ఎన్నో ఇబ్బందులు కలిగిస్తుంది. తక్కువ జీతంతో కుటుంబ అవసరాలను తీర్చుకోవడమే కష్టమైనప్పుడు గొడుగు కొనడం అతనికి సాధ్యంకాదు. వానలో తడవకుండా ఉండేందుకు గోనెసంచిని కప్పుకోవడం పేదవాడికి తప్పనిసరి కావచ్చు. వాన నుంచి తప్పించుకున్నా, చలి మరియు తడిసిన బట్టల బాధను అనుభవించాల్సి వస్తుంది. మరుసటి రోజు అనారోగ్యంతో మంచం ఎక్కే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ దృశ్యం పేదవాడి జీవితంలోని అసౌకర్యాన్ని, అసహాయతను హృదయానికి హత్తుకునేలా చూపిస్తుంది. వానకు మానవ లక్షణాలను ఆపాదించాడు. వాన ఒక చిలిపి పిల్లలా కిటికీలోంచి తొంగిచూస్తూ జల్లులు కురిపిస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రకృతి వర్ణనతో పాటు సామాజిక స్పృహ కూడా కనిపిస్తుంది. వానను ఆస్వాదించగలిగే వారి జీవితానికి, వాన వల్ల ఇబ్బందులు పడే పేదవారి జీవితానికి మధ్య తేడా ఉంటుంది. గొడుగు కొనలేని స్థితి, గోనెసంచి కప్పుకోవడంపై ఉన్న సామాజిక భావన, వానలో తడిసి అనారోగ్యానికి గురికావడం వంటి అంశాల ద్వారా పేదరికం, ఆర్థిక అసమానత వంటి సమస్యలను కవి ఎత్తిచూపాడు.

"ఇలా నగరంలో కురిసే వాన కేవలం గడుసరే కాదు
దానికీ కాస్తో కూస్తో ధర్మం, దయా వున్నాయి
మూడు రోజుల పసిపాపను
ముద్దుగా ఒడిలో గుండెలకద్దుకుంటూ
వెచ్చగా ఆస్పత్రినుంచి పచ్చగా యింటికి వెళ్ళే
పచ్చి బాలింతరాలి మీద
పూలజల్లు పడుతుంది గాని
భోరున వర్షం కురవదు"
(నగరంలో వాన – కుందుర్తి – పుట 11)

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

నగరంలో కురిసే వానను కేవలం ప్రకృతి దృశ్యంగా కాకుండా, మానవత్వం మరియు సామాజిక బాధ్యతగా కవి చిత్రించాడు. నగర వానకు కొంత దయ, ధర్మం ఉన్నట్లుగా ఊహిస్తే మూడు రోజుల పసిపాపను తల్లి ప్రేమగా గుండెలకు హత్తుకున్నట్లుగా, వాన కూడా నగరాన్ని ఆప్యాయంగా తాకుతుంది. ప్రసవం తర్వాత ఆస్పత్రి నుంచి ఇంటికి వస్తున్నప్పుడు ఆమెపై భారీ వర్షం పడకుండా, మృదువైన పూలజల్లుల్లా తేలికపాటి వర్షం కురుస్తుంది. ఇక్కడ వానకు జాలి, దయ ఉన్నట్లుగా చేసే మానవీకరణ కనిపిస్తుంది. పసిపాప, బాలింత, పూలజల్లు అనే పదాలు ఎంతో సున్నితమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. బాలింత శరీరానికి, పసిపాపకు ఇబ్బంది కలగకూడదనే కరుణతో వాన మృదువుగా కురిసినట్లుగా ఉంది. వాన ప్రకృతి శక్తి మాత్రమే కాకుండా మాతృత్వం, దయ, ఆప్యాయతలకు ప్రతీకగా మారింది.

"వాన కురిసే సమయం కోసం వారం పదిరోజులు వేచి
పరస్పరం సమాంతరంగా వర్షాదిలో భూమికి దిగిన
ముత్యాల వంటి రెండు చినుకులు
మిలమిలా మెరుస్తూ జలజలా జారుతూ
వచ్చిన దారిని నిచ్చెనవేసి
ఉవ్వెత్తుగా లేచిన ఊహతో మెల్లగా మెట్లెక్కిపోయి
మేఘావృత గగనంలోంచి మేదినివైపు చూతునుగదా"
(నగరంలో వాన – కుందుర్తి – పుట 14)

నగరంలో వాన కవితలో చలికాలం, వర్షం, చినుకులు, మేఘాలు, భూమి వంటి ప్రకృతి అంశాలు అద్భుతమైనవి. రెండు చినుకులను ముత్యాలుగా భావించవచ్చు. చలి ఎముకలు కొరికేస్తుంది అంటే చలి తీవ్రంగా ఉందని, అది శరీరాన్ని తీవ్రంగా బాధిస్తున్నట్లుగా ఉంది. వర్షం కోసం ప్రకృతి, భూమి, జీవరాశులు ఎదురు చూస్తున్నట్లుగా ఉంది. ఆకాశం నుంచి భూమివైపు పడుతున్న రెండు వర్షపు చినుకులు ముత్యాల వలె అందంగా ఉంటాయి.

చినుకులు పడుతున్నప్పుడు కనిపించే మెరుపును, వినిపించే శబ్దాలను 'మిలమిలా', 'జలజలా' వంటి శబ్దానుకరణాత్మక పదాలు వర్ష దృశ్యాన్ని మరింత సజీవంగా చేశాయి. చినుకులు భూమివైపు ప్రయాణించిన దారినే నిచ్చెనగా చేసుకుని తిరిగి పైకి ఎక్కుతున్నట్లుగా ఊహించవచ్చు. జీవితంలో సాధ్యం కాని ఈ దృశ్యం ఊహలలో నిజం అవుతుంది. చినుకులు తిరిగి మేఘాల దగ్గరకు చేరి, మేఘాలతో

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

కప్పబడిన ఆకాశం నుంచి భూమిని చూస్తున్నట్లుగా ఉంటుంది. అంటే ఆకాశం, చినుకు, భూమి మధ్య ఒక అద్భుతమైన సంబంధాన్ని సృష్టించాడు.

"చార్‌మినార్ గోపురాగ్రం మీద పడి నిలిచిన చినుకు
ఎత్తైన సింహాసనం మీద ఎక్కిన ధీమా కాబోలు
కాలిమీద కాలేసి మీసం మేలేసుకుంటూ
నగరం నాలుగు మూలలు సగర్వంగా చూసింది.
చీటికి మాటికి కోర్టుకెక్కడం చిదరెత్తింది కాబోలు
హైకోర్టు భవనం మీద చింతలో చిందిన చినుకు
ప్రక్కనేవున్న మూసీనదిలో పడి ముక్కు మూసుకుంది
శాసనసభా శిఖరం మీద చల్లగా జారిన బిందువు
ఆకాశం వంక తలయెత్తి చూసి
చాలిక వర్షమని శాసించింది
అంతటితో వాన వెలిసింది
అదీ నగరంలో వాన
నాకు తెలిసిన నగరంలో వాన
అంటే
'హైదరాబాదులో వాన'"
(నగరంలో వాన – కుందుర్తి – పుట 17)

ఈ కవితలో వాన చినుకుకు మానవ లక్షణాలను ఆపాదించి, నగరంలోని రాజకీయ, న్యాయ, చారిత్రక పరిస్థితులపై వ్యంగ్యాన్ని కూడా ప్రదర్శించారు. చార్మినార్ శిఖరంపై పడిన చినుకు చాలా ఎత్తులోకి చేరినందుకు గర్వపడి, ఒక గొప్ప సింహాసనంపై కూర్చున్న అనుభూతి కలిగింది. ఆ చినుకు మనిషిలా కాలుమీద కాలు వేసుకుని, మీసం మెలేసుకుంటూ గర్వంగా నగరాన్ని చూస్తున్నట్లుగా ఉంది. ఇది చినుకుకు చేసిన మానవీకరణతో కూడిన హాస్యభరితమైన ఊహ. శాసనసభ భవనంపై పడిన వానబిందువు ఆకాశం వైపు చూసి ఇక వర్షం చాలు అని ఆజ్ఞాపించినట్లుగా ఉంది. ఇక్కడ 'శాసించింది' అనే పదం చమత్కారంగా ఉంది. శాసనసభలో ప్రజల కోసం చట్టాలు రూపొందించే ప్రక్రియను గుర్తుచేస్తూ

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

వానబిందువును కూడా 'శాసించే' వ్యక్తిగా చిత్రించారు. ఇక్కడ నగర వాన అంటే హైదరాబాద్ నగరంలో కురిసే వాన. చార్మినార్, హైకోర్టు, మూసీ, శాసనసభ వంటి హైదరాబాద్ ప్రత్యేకతలను వానతో అనుసంధానించడం ద్వారా నగరానికి ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక రూపాన్ని ఇచ్చారు.

**ముగింపు:**

నగరంలో వాన కవిత నగర జీవితంలోని వైవిధ్యాన్ని, నిరంతర చలనాన్ని, వర్షపు చినుకుల సౌందర్యాన్ని కలిపి చూపించిన ఆధునిక కవిత. ఒక అరగంటలో కనిపించే అనేక దృశ్యాల ద్వారా ఒక మహానగర జీవన చిత్రాన్ని కుందుర్తి ఆవిష్కరించారు. చినుకుకు మానవ లక్షణాలను ఆపాదించడం ద్వారా అద్భుతమైన సృజనాత్మకతను ప్రదర్శించారు. వర్షం యొక్క ప్రభావం ప్రతివ్యక్తిపైనా, ప్రతివస్తువుపైనా భిన్నంగా ఉంటుంది. ఆనందం, విషాదం, సౌందర్యం, మురికి, ఆధునికత, మత్తు, ఆశ, నిరాశ ఇవన్నీ ఒకే నగర జీవితంలో సహజీవనం చేయడాన్ని కుందుర్తి ఆంజనేయులు అందంగా చిత్రించారు.

**ఆధార గ్రంథాలు:**

నగరంలో వాన (1967) – కుందుర్తి ఆంజనేయులు.
కుందుర్తి కవిత్వం వస్తు వైవిధ్యం (2005) – ఎస్. జి. శశికళ.
కుందుర్తి వ్యాసాలు (1987) – కుందుర్తి.